నేడు 'పుస్తకంతో నడక'



బాగ్‌లింగంపల్లిలో పోస్టర్‌ను పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూపతివెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 'పుస్తకంతో నడక' అనే కార్యక్రమాన్ని ఈనెల 8న చేపట్టనున్నట్లు టీపీఎస్‌కే కన్వీనర భూపతివెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లిలోని సిటీ సెంటర్ లైబ్రరీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాలలు, కళాశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడానికి ఈ ఉద్యమం ఉపకరిస్తుందని పేర్కొన్నారు. పుస్తకాన్ని చదివే సంస్కృతిని పెంచే దిశగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన సదస్సు

అబిడ్స్: స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 1న ప్రారంభమైన 'సుస్థిర శక్తి వాతావరణంలో మార్పులు' అనే అంశంపై నిర్వహించిన అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ఆదివారం ముగిసింది. కన్వీనర్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ కెఎల్. వసుంధర, కోఆర్డినేటర్‌గా ఎం.మధవి వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్శిటీ మ్యాథమెటిక్స్ సీనియర్ ప్రొఫెసర్ ఎన్.కిషన్ హాజరై ప్రసంగించారు. బొగ్గు, పెట్రోలియం ఉపయోగించడం వల్లే వాయు కాలుష్యం అవుతుందని పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయనాల వల్ల నీరు, నేల కాలుష్యమవుతుందన్నారు. సౌరశక్తి, వాయుశక్తి, జీవ ఇంధనాలు, హైడ్రోజన్ టెక్నాలజీ మనకు భవిష్యత్తును అందించే సాధనమని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 13 మంది ఆచార్యులు, శాస్త్రవేత్తలు ప్రసంగించారు. వారం పాటు జరిగిన అటల్ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా బిషప్ ఏ సైమాన్, కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ కె.కృష్ణారావు వ్యవహరించారు. ప్యాట్రన్‌గా కళాశాల డీన్, ప్రొఫెసర్ వినయ్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎల్.రాజు వ్యవహరించగా కోర్సు కో ఆర్డినేటర్లుగా డాక్టర్ జి.శిరీష, డాక్టర్ విద్యా భార్గవి వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమూర్తి, ఆర్.అండ్.బి డైరెక్టర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, మొదటి సంవత్సరం డైరెక్టర్ వి.అనురాధ, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆకుల రమేశ్‌తో పాటు దేశ వ్యాప్తంగా 250మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి

గన్‌ఫౌండ్రీ: గురువులను పూజించే గొప్ప సంస్కృతి మనదని సరస్వతి ఉపాసకుడు దైవాజ్ఞశర్మ అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వతి పరిషత్‌లో చిరాగ్ డ్యాన్స్, ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురుదేవోభవ పేరిట జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడారంగంలో జాతీయస్థాయిలో రాణిస్తున్న షాన్వి, ఇషికాతో పాటు పలువురు గురువులను సన్మానించారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యువ హీరో సిద్ధార్థ్ సాయి, డాక్టర్ నాగబాబు, సమాజ సేవకులు షేక్ శంషీర్, ప్రిన్సిపాల్ ఎస్.ఉదాయ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్‌కె.సిరాజ్ పాల్గొన్నారు.

'మిలాద్-ఉన్-నబీ'ని ప్రశాంతంగా జరుపుకోవాలి

ముషీరాబాద్: నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కృషితో ప్రశాంతంగా గణేశ్ నిమజ్జన వేడుకలు జరిగాయని పీపుల్ అండ్ పీస్ కమిటీ గ్రేటర్ అధ్యక్షుడు ముక్తార్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం హరినగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయవంతంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహించిన నగర పోలీసులకు అభినందనలు చెప్పారు. పోలీసులకు పీపుల్ అండ్ పీస్ కమిటీ సభ్యులు కూడా సహకరించారని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను కూడా ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

అంబేడ్కర్‌కు జ్ఞానమాల

లాలాపేట: తార్నాక చింతల్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం చింతల్ బస్తీ నాయకులు జ్ఞానమాల సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దళిత బహుజనుల్లో నిత్యం అంబేద్కర్ స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతోనే ప్రతివారం అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతల్ లక్ష్మణ్, టి. హరిబాబు, మనోహర్, ప్రసన్న పాల్గొన్నారు.

రైలులో నగదు, నగల బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బ్యాగ్ చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పార్శిగుట్ట ప్రాంతానికి చెందిన మాధవి (50) కాచిగూడకు రావడానికి నాగర్‌సోల్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలు ధర్మాబాద్ స్టేషన్‌కు వచ్చే సరికి తన బ్యాగ్ కనిపించలేదు. బ్యాగులో 35 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ఐ ఫోన్లు, రూ.20వేల నగదు ఉంది. బాధితురాలు ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

లడ్డూ ప్రసాద వేలం..
పోటీపడ్డ భక్తజనం

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు గుండ్ల గజానంద్ స్వామివారి 25 కిలోల లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో రూ.1.78 లక్షలకు దక్కించుకున్నారు. తమ కుటుంబ సభ్యులు ఈ ఆలయం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని తన పేరును వినాయకుని పేరుకు ప్రతిరూపంగా గజానంద్ అని పెట్టారని తెలిపారు. క్రిస్టియన్, ముస్లింలు సైతం కూడా లడ్డూ ప్రసాదం ఇవ్వాలని తనను కోరుతున్నారని పేర్కొన్నారు. ఇది తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఆదివారం గజానంద్ 'సాక్షి'కి సంతోషంతో తెలిపారు.

కాపువాడలో రూ.3.4లక్షలకు...

◆ అదే విధంగా చిక్కడపల్లి వివేక్‌నగర్ కాపువాడలో గజానన ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు సాయికుమార్, పవన్, కౌశిక్‌లు రూ.3లక్షల40వేలకు వేలం పాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో దక్కించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.



లక్ష్మీగణపతి లడ్డూ ప్రసాదాన్ని రూ.1.78లక్షలకు దక్కించుకున్న గజానంద్

రాంనగర్‌లో రూ.5.70లక్షలకు...

ముషీరాబాద్: రాంనగర్‌లోని త్రిశూల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ ప్రసాద వేలం పాటలో గాంధీనగర్‌కు చెందిన సాయి ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ అధినేత కాదీవుల సాయికుమార్ కైవసం చేసుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని రూ.5.70 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని రూ.5.70 లక్షలకు దక్కించుకున్న కాదీవుల సాయికుమార్

చంద్రగ్రహణం సందర్భంగా ఆర్టీసీక్రాస్ రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయం, వివేకనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం మూసివేత





సంప్రోక్షణ తర్వాతే దర్శనానికి అనుమతి

చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాలు మూసివేత

నల్లకుంట: చంద్రగ్రహణం నేపథ్యంలో న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయాన్ని మూసేస్తున్నట్లు ఆలయ ఈవో కె. జయంతి తెలిపారు. సోమవారం(నేడు) ఉదయం ఆలయ సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. అదే విధంగా నల్లకుంటలోని శంకరమఠం, పాతరామాలయం, లింగాలగడ్డ శివాలయం, తిలక్‌నగర్ శివాలయం, బాగ్‌అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం, అహోబిలమఠం తదితర ఆలయాలను మూసేశారు. తిరిగి సోమవారం ఉదయాన్నే ఆలయాల సంప్రోక్షణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

◆ చిక్కడపల్లి: చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి, వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయాలతో నియోజకవర్గంలోని ఆలయాలను మూసేశారు. సోమవారం ఉదయం 6గంటలకు ఆలయాలను తెరచి సంప్రోక్షణ చేసి శుద్ధిచేస్తామని ఆలయాల చైర్మన్‌లు, ఈఓలు తెలిపారు.



శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయం మూసివేత

నైపుణ్యం ఉంటే మంచి అవకాశాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏ రంగాన్ని ఎంపిక చేసుకుంటామో ఆ రంగంలో నైపుణ్యం సాధిస్తే వారికి మంచి అవకాశాలు లభిస్తాయని ప్రముఖ విద్యావేత్త టి. గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలోని ఆరోరా డిగ్రీ, పీజీ కళాశాలలో జీవితంలో విజయవంతం కావడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గోపాలకృష్ణ మాట్లాడుతూ.... విద్యార్థులలో సృజనాత్మకత ఉండాలన్నారు. ముఖ్యంగా ఉన్నత లక్ష్యంతో పాటు క్రమశిక్షణ, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకుంటే వారు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని చెప్పారు. విజయవంతం కావాడానికి ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని తన అనుభవాలను ఉదాహరణతో వివరించారు. మనం వెళ్లే దారిలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని వాటిని అధిగమించినప్పుడే విజయానికి చేరుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా. అజయ్ కుమార్, కోఆర్డినేటర్ డా. మీరాజోషి, సైన్స్ విభాగాధిపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రముఖ విద్యావేత్త టి. గోపాలకృష్ణ

ఉన్నతులుగా తీర్చిదిద్దే వారే గురువులు

చిక్కడపల్లి: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే వారే గురువులని యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'భారత్ ఐకాన్ – ఉత్తమ ఉపాధ్యాయ'పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణకు ఎంపికైన ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యతో పాటు వివిధ నైపుణ్యాలను అందించేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి, ప్రముఖులు చక్రపాణి, దామోదర్, నాగేంద్ర, భరతనాట్య గురువు రాగరంజని, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భరతనాట్య గురువు రాగరంజనిని సన్మానిస్తున్న లంకా లక్ష్మీనారాయణ

విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలి



ఫీజు బకాయిలను విడుదల చేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ బీసీ మహాసభ నేతలు

కాచిగూడ: విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఫీజు బకాయిలు చెల్లించాలని ఆదివారం కాచిగూడ, నింబోలిఅడ్డ సర్కిల్‌లో బీసీ నేతలతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌పటేల్‌గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులకు ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న యువత, విద్యార్థులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్ అందకారంగా మారుతోందని అన్నారు. విద్యార్థుల ఫీజుబకాయిలు రూ.4,300 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్కాలర్‌షిప్స్ రూ.15వేల వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, భూషణ్, భాస్కర్, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రతిభను పెంపొందిస్తాయి

చిక్కడపల్లి: నాట్య కళాకారుల్లో కూచిపూడి నృత్య పోటీలు ప్రతిభను పెంపొందిస్తాయని బీఆర్ఎస్ సీనియర్ నేత నాగేష్ ముదిరాజ్ అన్నారు. బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం త్యాగరాయగానసభలో కూచిపూడి నృత్యపోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, మిలటరీ అధికారి కేసీ. రావు, నిర్వాహకులు విక్కీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో బీఆర్ఎస్ నేత నాగేష్ ముదిరాజ్

నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: రెడ్డి జన సంఘం (అబిడ్స్) ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లోని పేద విద్యార్థులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదివారం ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 307 మంది విద్యార్థులకు రూ.26.22 లక్షలు విలువైన చెక్కులు అందజేశామన్నారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంఘం కృషి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అలాగే రెడ్డి జన సంఘం ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వేమ్‌రెడ్డి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు సుకన్యరెడ్డి పాల్గొన్నారు.

బోసిపోయిన 'బడా గణేశ్' చౌరస్తా

ఖైరతాబాద్ మహాగణపతి వినాయక ఉత్సవాలతో నిత్యం లక్షలాది మంది భక్తులతో పుణ్యక్షేత్రాన్ని తలపించిన ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తా ఆదివారం బోసిపోయి దర్శనమిచ్చింది. రోజూ లక్షలాది మంది భక్తులతో అడుగు తీసి అడుగు వేయలేనంత మంది రద్దీతో దర్శనమిచ్చిన ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలు శనివారం ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనోత్సవం పూర్తి కాగానే ఆదివారం బోసిపోయి దర్శనమిచ్చింది.

– ఖైరతాబాద్



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్య శిక్షణాలయం నర్తనం ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నృత్య గురువు సంధ్యారాణి శిష్యులు హరిణి రాజ్యలక్ష్మి, శరణ్యశ్రీల కూచిపూడి ఆరంగేట్రం రవీంద్రభారతిలో ఆదివారం కనుల పండువగా జరిగింది. దంతం భజే, హర హర హర శంభో, దుర్గా తరంగం, ప్రహ్లాద పట్టాభిషేక శపతం, థిల్లానా వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ఉన్నత విద్యను అభ్యసిస్తూ శాస్త్రీయ సంగీత కళలను నేర్చుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ భాగవతుల సేతురాం, కూచిపూడి నాట్య గురువు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావు, నాట్య కళా మయూరి ఆర్.ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు అందని వేతనాలు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులకు గత రెండు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పరుశరామ్ మాట్లాడుతూ..ప్రతినెల 1న రెగ్యూలర్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్టు అధ్యాపకులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా ఓయూ అధికారులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకులకు సెప్టెంబర్ 8వ తేదీ వచ్చినా వేతనాలు చెల్లించడం లేదన్నారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి జూన్ నెల నుంచి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని ఓయూ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ లీగ్ ప్రారంభం

లాలాపేట: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్, తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆస్మిత వెయిట్ లిఫ్టింగ్ లీగ్–2025–26 ఆదివారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా ఆస్మిత కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో సీనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 80 మంది పాల్గొన్నారు. ఈ లీగ్‌లో అర్హత సాధించిన ఆటగాళ్లు త్వరలో బెంగుళూరులో జరుగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ తిరుపతయ్య పాల్గొని విజేతలకు పతకాలు అందజేశారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

లాలాపేట: బంజారా, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ స్టూడెంట్ ఫోరం అధ్యక్షుడు భట్టు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదివాసీ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఐక్యతను చాటేలా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలస, చొరబాటుదారులు నేడు తెలంగాణ సమాజాన్ని పట్టి పీడిస్తున్నారని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఆదివాసీలకు రావాల్సిన అన్ని అవకాశాలను లంబాడీలు, బంజారాలు తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని నేడు వారే తమ అస్థిత్వాన్ని సైతం దోచుకుంటున్నారని మండిపడ్డారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్



విలేకరుల సమావేశంలో అభివాదం చేస్తున్న డా. దిడ్డి సుధాకర్

కవాడిగూడ: రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాచరణ రూపొందించామని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం దోమలగూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. నగరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. మొదటి విడతలో 50 వేల సభ్యత్వలే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీని ప్రజలకు చేరువ చేసేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ త్వరలో సభ్యత్వ నమోదు ఎలా చేయాలనే దానిపై నిర్ణయాలు తీసుకుంటుదని తెలిపారు. ఈ సమావేశంలో ఆప్ నగర నేతలు మహమ్మద్ మజీద్, హేమ, సుదర్శన్, సాదిఖ్, శివాజీ, రమ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రాగ బాల శతకం' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు, కవయిత్రి డాక్టర్ సూర్యదేవర రాధారాణి రచించిన 'రాగ బాల శతకం'పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శింగిణి స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డా. భూపాల్ మాట్లాడుతూ... చిన్న పిల్లల నోట పలికే భాషలో ఈ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని అన్నారు. పిల్లలు, పెద్దలు, ఉపాధ్యాయులకు చెందే పద్యాలను చందోబద్ధమైన ఆటవెలది పద్య రూపంలో రచించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎస్.రఘు, డా. వీఆర్. శర్మ, డా. ఉప్పల పద్మ, డా. సూర్యదేవర జతిన్‌కుమార్, డా. సింధుజ, బేబీ రాగ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

లక్ష్మీగణపతి రథయాత్ర



చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం ఉదయం మహాపూర్ణహుతి, అఖండబలి, సత్యనారాయణస్వామి వ్రతాన్ని కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్వామివారిని పురవీధుల్లో రథయాత్రగా తీసుకెళ్లగా భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మారెడ్డి, చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, కమిటీ సభ్యులు బండారు నవీన్, గుర్రం దినేష్, జి.గజానంద్, రమణ, రమణమూర్తి, జి.లలిత, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు కొనసాగిన నిమజ్జనోత్సవాలు

చార్మినార్: పాతబస్తీ శివారులోని బాలాపూర్ నుంచి శనివారం ఉదయం ప్రారంభమైన నిమజ్జనోత్సవ శోభాయాత్ర అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. బాలాపూర్, చాంద్రాయణగుట్ట, షంషీర్‌గంజ్, అలియాబాద్, శాలిబండ, మక్కా మసీదు, చార్మినార్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపుల్ ద్వారా అఫ్జల్‌గంజ్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరింది. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత మూర్తి తదితరుల ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద బందోబస్తులోని పోలీసు అధికారులు, ఉత్సవాల నిర్వాహకులు, శాంతి సంఘం సభ్యులు, భక్తులను వారు అభినందించారు. నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.



చార్మినార్ వద్ద పోలీసు అధికారులతో డీసీపీలు స్నేహా మెహ్రా, రక్షిత మూర్తి